RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:251 శుక్రవారం 30 అక్టోబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

మల్లన్నసాగర్ కూల్చేందుకు ప్రభుత్వం కుట్ర

- అర్ధరాత్రి కట్టకు 150 మీటర్ల దూరంలో బ్లాస్టింగ్‌లు
- కిలోమీటరు దూరంలోని తిప్పారంలో ఇళ్లకు పగుళ్లు
- ఇరిగేషన్ అధికారుల లేఖను బేఖాతరు చేసిన జలమండలి
- బ్లాస్టింగ్‌లు ఆపాలి..
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- మంత్రి ఉత్తమ్‌కు బహిరంగ లేఖ

సిద్దిపేట, అక్టోబర్ 29:

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ ప్రాజెక్టు భద్రతకు ముప్పు తెస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. మల్లన్నసాగర్‌ను కూల్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందా? అని ప్రశ్నించారు. తక్షణమే పేలుళ్లను నిలిపివేసి, కట్ట భద్రతపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద రిజర్వాయర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త

మిగతా 2వ పేజీలో..



కరువును వదిలి మూసీపై మోజెందుకు?

- రేవంత్ సర్కారుదే కరువంటూ కేటీఆర్ విమర్శ
- మూసీ డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్
- రైతులకు ఎకరాకు రూ.60 వేల పరిహారం ఇవ్వాలి
- మూసీ నిధులను రైతుల కోసం మళ్లించాలని సూచన



హైదరాబాద్, అక్టోబర్ 29:

రాష్ట్రంలో రైతులు కరువు కష్టాలతో అల్లాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణపై దృష్టి పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తమ హెచ్చరికలను పట్టించుకోకుండా వెయ్యి టీఎంసీల నీటిని దిగువకు వదిలేయడంతో సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 365 మండలాలు కరువు ప్రభావంలో ఉన్నట్లు ప్రభుత్వమే ప్రకటించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయినా మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలను

మిగతా 2వ పేజీలో..



రికార్డుస్థాయి పెట్టుబడులే లక్ష్యం

- పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా
- హైదరాబాద్‌ను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దుతాం
- దిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- పాల్గొన్న కేంద్ర మంత్రి పీయుష్ గోయల్, రాష్ట్ర మంత్రులు

న్యూదిల్లీ,

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట' కర్టెన్ రైజర్ కార్యక్రమం దిల్లీలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హృదయపూర్వక స్వాగతం పలికారు. సమ్మిట్‌కు మిమ్మల్ని అందరినీ ఆహ్వానిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్‌లతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలు,

మిగతా 2వ పేజీలో..



తెలంగాణ రైజింగ్–2047

లక్ష్యం సాధ్యమే

- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం
- ఫార్మా, ఏరోస్పేస్, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో అపార అవకాశాలు
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను

భాగస్వామిని చేయండి

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

ఆసుపత్రిలో వాగ్వాదం..


యువకుడి ఆత్మహత్య

- రిమ్స్‌లో వైద్యం విషయంలో వివాదం
- పోలీస్‌స్టేషన్‌లో దాడి చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- వైద్యులు, పోలీసులే కారణమంటూ సూసైడ్ నోట్ రాసినట్లు వెల్లడి
- రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్



పోలీసు అధికారులే టార్గెట్‌గా..

- హనీట్రాప్ కేడీ మోసాల చిట్టా
- వెయ్యి మందితో గ్రైండర్ యాప్ ద్వారా పరిచయాలు
- 82 మందికి సంబంధించిన ప్రైవేట్ వీడియోలు, ఫొటోలు గుర్తింపు
- పోలీసు అధికారుల నుంచి రూ.15.5 లక్షలు వసూలు
- బాధితుల నుంచి రూ.25–30 లక్షలు కాజేసినట్లు అంచనా





లాఠీలకు భయపడొద్దు..

మార్చ్‌పై వెనక్కి తగ్గేదేలే!

- నవంబర్ 1న ఢిల్లీలో చలో రామ్‌లీలా మార్చ్
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపు
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం
- విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని విజ్ఞప్తి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

4

జాతీయ పరీక్షల సంస్కరణలపై

పార్లమెంటరీ కమిటీ దృష్టి

- నీట్ సహా ప్రజా పరీక్షల నిర్వహణపై సమీక్ష
- కోచింగ్ సెంటర్ల నిబంధనల అమలుపై పరిశీలన
- జాతీయ విద్యా విధానం అమలుపై అధ్యయనం
- విద్యారంగంలో ఏఐ ప్రభావంపైనా సమీక్ష



4

మియాపూర్ భూములపై ప్రభుత్వానికి ఊరట

- ప్రైవేట్ వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేత
- 2003 హైకోర్టు తీర్పునకు సుప్రీం సమర్థన
- సర్వే నంబర్లు 100, 101పై వివాదానికి తెర

2





ఆన్‌లైన్ ఫార్మసీలపై

టీజీ సేఫ్ కొరడా

- 106 మెడికల్ షాపుల్లో తనిఖీలు
- 32 దుకాణాలకు షోకాజ్ నోటీసులు
- ప్రిస్క్రిప్షన్లు, రిజిస్టర్ల నిర్వహణలో లోపాలు
- నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు

3



నిమ్స్‌లో అవినీతి బాగోతం

- రూ.50 లక్షల వరకు ముడుపులు వసూలు చేసినట్లు గుర్తింపు
- ఫలహారశాలలు, మందుల దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు
- ఏసీబీ, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ శాఖల సంయుక్త సోదాలు
- వైద్యుడు లక్ష్మీ భాస్కర్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ

3

మహిళల భద్రతకు 15 ఈవీ కార్లు

- స్పందనకు 7, పెట్రోలింగ్‌కు 8 వాహనాలు
- ఒక్క ఛార్జింగ్‌తో 468 కి.మీ. ప్రయాణం
- 185 రోజుల్లో 8,903 ఫిర్యాదులపై స్పందన
- నలుగురు చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన బృందాలు

2



ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామిని చేయండి

- **ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు**

న్యూదిల్లీ, అక్టోబర్ 29 :

సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామిని చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. దిల్లీలో గురువారం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' కర్టెన్ రైజర్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది 'తెలంగాణ రైజింగ్' విజన్‌కు శ్రీకారం చుట్టామని ఆయన చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతలను వివరించి పారిశ్రామికవేత్తలను 'రైజింగ్ తెలంగాణ' విజన్‌లో భాగస్వాములను చేసేందుకే దిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' కర్టెన్ రైజర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.0లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

మల్లన్నసాగర్ కూల్చేందుకు ప్రభుత్వం కుట్ర

మొదటిపేజీ తరువాయి

ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.

పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో అర్ధరాత్రి వేళల్లో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. రిజర్వాయర్ కట్టకు కేవలం 150 మీటర్ల దూరంలోనే పేలుళ్లు జరుపుతున్నారని, వాటి ప్రభావంతో కిలో మీటరు దూరంలోని తిప్పారం గ్రామంలో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలోనే బ్లాస్టింగ్‌లు నిర్వహించాల్సి ఉండగా, వాటిని ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ లేఖ రాసినా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మల్లన్నసాగర్ భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హరీశ్‌రావు హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీ తరహాలో మల్లన్నసాగర్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు. బ్లాస్టింగ్‌లను వెంటనే నిలిపివేయాలని, కట్ట భద్రతపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై మంత్రికి బహిరంగ లేఖ రాస్తామని వెల్లడించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ భూసేకరణలో అసైన్డ్ భూముల రైతులకు తక్కువ, పట్టా భూముల రైతులకు ఎక్కువ పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తిప్పారం గ్రామస్థులు కూడా బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని, రిజర్వాయర్ కట్టకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సర్పంచ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కరువును వదిలి మూసీపై మోజెందుకు?

మొదటిపేజీ తరువాయి

రానీయకుండా అడ్డుకున్నారని, తమ పార్టీ ఎమ్మెల్యేలను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని మూసీలోకి తరలిస్తామనడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో లిఫ్టుల ద్వారా పొలాలకు నీరు అందేదని, ప్రస్తుతం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. పరిశ్రమలు, ఐటీ కారిడార్‌లోనూ విద్యుత్ అంతరాయాలు ఎదురవుతున్నాయని అన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కరువు సమయంలో నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. తెలంగాణలో రైతు భరోసా బకాయిలు చెల్లించడంతోపాటు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.60 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన రూ.1.5 లక్షల కోట్లను రైతుల సహాయానికి మళ్లించాలని, బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



మహిళల భద్రతకు 15 ఈవీ కార్లు

హైదరాబాద్, అక్టోబర్ 29:

మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులకు 15 టాటా పంచ్ ఈవీ స్మార్ట్+ కార్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ఏడింటిని స్పందన విభాగానికి, ఎనిమిదింటిని లా అండ్ ఆర్డర్ పెట్రోలింగ్‌కు కేటాయించారు. పేట్లబురుజులోని సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ సీవీ ఆనంద్ వీటిని ప్రారంభించారు. హెచ్‌సీఎస్‌సీ సీఎస్ఆర్ నిధులతో వాహనాలను సమకూర్చింది.

కొత్త వాహనాలతో ఫిర్యాదు అందిన వెంటనే ఘటనాస్థలికి చేరుకునే వీలుంటుందని డీజీపీ తెలిపారు. పాతబస్తీ ఇరుకైన వీధుల్లోనూ వేగంగా వెళ్లేందుకు వీలుగా వీటిని ఎంపిక చేసినట్లు పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ చెప్పారు. 40 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 468 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని వివరించారు.

స్పందన విభాగం 185 రోజుల్లో 8,903 ఫిర్యాదులపై స్పందించింది. వీటిలో 1,900 సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా, 1,164 వివాదాలను రాజీతో పరిష్కరించింది. మరో 2,504 కేసులను పోలీస్ స్టేషన్లకు బదిలీ చేయగా, 61 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తప్పిపోయిన నలుగురు చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతోపాటు గృహహింస, ఆత్మహత్యాయత్నాల ఘటనల్లో బాధితులను రక్షించి సఖి కేంద్రాలు, ఆశ్రయ గృహాలకు తరలించారు.

తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యం సాధ్యమే

ఢిల్లీ:

తెలంగాణ నిర్దేశించుకున్న 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. సమష్టి కృషితో దానిని సాధించవచ్చని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఫార్మా, అంతరిక్షం, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, ఆహార శుద్ధి, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు ప్రధానంగా ఆశించేది విధానాల్లో స్థిరత్వం, నిబంధనల్లో స్పష్టత, వ్యాపార నిర్వహణలో పారదర్శకతేనని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఇందుకు తెలంగాణ చరిత్రలోని కాకతీయుల కాలం నాటి ఉదాహరణను ప్రస్తావించారు. క్రీ.శ. 1244లో కాకతీయ పాలకుడు గణపతిదేవుడు మోటుపల్లి ఓడరేవులో జారీ చేసిన అభయ శాసనం సముద్ర వాణిజ్యంలో కీలక సంస్కరణలకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

తెలంగాణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లు

తెలంగాణ నుంచి ఎగుమతులు పెంచేందుకు రాష్ట్రం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. రాష్ట్రంలోని అత్యధిక ఎగుమతి సామర్థ్యం ఉన్న 50 ఉత్పత్తులు, సేవలను గుర్తించాలన్నారు. తెలంగాణలోని జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఇందుకు నాణ్యమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఉత్పత్తుల మూలాలను గుర్తించే ట్రేసబిలిటీ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. తాండూరు కందిపప్పు, చపాటా మిర్చి, నిజామాబాద్ పసుపు వంటి ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. వాటికి అంతర్జాతీయంగా మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకుంటే రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు.ఇటీవల తాండూరు ఎర్ర కందిపప్పు ఉత్పత్తులను హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి చేయడం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న అవకాశాలకు నిదర్శనమని కేంద్ర మంత్రి అన్నారు.

ఫార్మా రంగంలో ఆవిష్కరణలకు ప్రాధాన్యం

తెలంగాణ ఫార్మా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గోయల్ సూచించారు. జనరిక్ ఔషధాల తయారీకి మాత్రమే పరిమితం కాకుండా, అధిక విలువ కలిగిన బ్రాండెడ్ ఔషధాలు, వినూత్న ఔషధాలు, బయోసిమిలర్ల తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంతరిక్షం, విమానయాన రంగాలు, విమాన విడిభాగాల తయారీ, నిర్వహణ-మరమ్మతు సేవలు (ఎంఆర్ఓ), రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో తెలంగాన పెట్టుబడులను ప్రోత్సహించాలని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిని ఆయన ప్రస్తావించారు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తేనే వివిధ పరిశ్రమల్లో ప్రపంచస్థాయి నాయకత్వం సాధ్యమవుతుందని చెప్పారు. దీపావళి పండుగ సమయంలో ఒక్కో దీపం వెలిగించడం ద్వారా వెలుగులు విస్తరించినట్లే.. ఒక్కో పెట్టుబడి, ఒక్కో ఎగుమతి, ఒక్కో కొత్త ఉద్యోగం, ఒక్కో స్టార్టప్ దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. భారత్, తెలంగాణ భవిష్యత్తు ఉమ్మడి కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు రాష్ట్రంలోని అవకాశాలను పరిశీలించి దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆహ్వానించారు. ఈ పెట్టుబడుల ద్వారా ఉద్యోగాల సృష్టి, ప్రజల సంపద పెరుగుదల, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

రికార్డుస్థాయి పెట్టుబడులే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. నాలుగు శతాబ్దాల క్రితమే హైదరాబాద్ చార్మినార్ కేంద్రంగా అంతర్జాతీయ వ్యాపారానికి కేంద్రీకృతమైందని, ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, వెండి కళాకృతులకు పేరొందిందని గుర్తు చేశారు. నిజాం పాలకులు అద్భుతమైన కట్టడాలు, ప్రపంచస్థాయి మ్యూజియం, టంకశాల (నాణేల ముద్రణాలయం), విమానాశ్రయం, రైల్వేలు, అత్యుత్తమ విద్యా సంస్థలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారన్నారు.

గ్లోబల్ లీడర్ల జన్మస్థలి

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్ వంటి మహానాయకులను ప్రపంచానికి అందించిందని సీఎం రేవంత్ కొనియాడారు.

ఆర్థిక దార్శనికులకు నివాళి

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను తయారు చేయడంలో హైదరాబాద్‌కు ప్రత్యేకత ఉందని సీఎం చెప్పారు. భారత దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేసిన మహా నేతలను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ఫోన్, ఇంటర్నెట్ లేని జీవితాన్ని మనం ఊహించలేం.. రాజీవ్ గాంధీ హైదరాబాద్‌లో పైలట్ శిక్షణ పొందారు. పైలట్‌గా కూడా పనిచేశారు.. అందుకే హైదరాబాద్‌లోని ప్రపంచస్థాయి విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు..టెలికాం, కంప్యూటర్ విప్లవానికి మూలకారకుడైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, 1991లో ఆర్థిక సంస్కరణల (ఎల్‌పీజీ) ద్వారా దేశాన్ని గట్టెక్కించిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు సేవలకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెల్యూట్ చేశారు.

3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

హైదరాబాద్ జీవనంలోనే ప్రపంచస్థాయి దృక్పథం ఉంది. సంస్కరణలను స్వీకరించే తత్వం, పారిశ్రామిక స్ఫూర్తి ఉన్నాయి. 1991 నుంచి హైదరాబాద్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలు అధికారంలోకి ఉన్నాయి. రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నప్పటికీ హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అంతా మద్దతుగా నిలిచారని చెప్పారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5% నుండి 10%కి పెంచుతామన్నారు. 'తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మీరు అనుకున్న మొత్తాన్ని, వృద్ధి అంచనాలను, లాభాలను రెట్టింపు చేసుకోండి. మీ పెట్టుబడులకు భద్రత కల్పించే సంరక్షకుడిగా నేను ఉంటాను' అని వ్యాపారవేత్తలకు హామీ ఇచ్చారు. పెట్టుబడిదారుల్లో చాలామందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యన సంబంధాలపై సందేహాలున్నాయి. అభివృద్ధి విషయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మధ్య సంబంధాలు ఏమిటనేది కేంద్ర మంత్రి ఇప్పుడే చెప్పారన్నారు. తెలంగాణ ఎదుగుతోందిజ. ఈ ప్రగతి ప్రస్థానంలో మీరూ భాగస్వాములు కండి.. మనమంతా కలిసి ఎదుగుతూ చరిత్ర సృష్టిద్దాం అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ సహకారం

దేశంలో కేంద్రం ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు (హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణె) తెలంగాణకే రావడం సంతోషకరమని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు (ఆరఆరఆర్) ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్ పోటీ భారతీయ నగరాలతో కాదని, న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతోనేనని స్పష్టం చేశారు.

ఆసుపత్రిలో వాగ్వాదం.. యువకుడి ఆత్మహత్య

- **రిమ్స్ లో వైద్యం విషయంలో వివాదం**
- **పోలీస్‌స్టేషన్‌లో దాడి చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ**
- **వైద్యులు, పోలీసులే కారణమంటూ సూసైడ్ నోట్ రాసినట్లు వెల్లడి**
- **రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్**

ఆదిలాబాద్, అక్టోబర్ 30:


ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లిన యువకుడు అనంతరం ఆత్మహత్య చేసుకోవడం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించింది. పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన రాహుల్ కాంబ్లే (26) మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. తన మరణానికి వైద్యులు, పోలీసులే కారణమంటూ రాహుల్ సూసైడ్ నోట్ రాసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు, దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



గత రాత్రి తేలు కుట్టడంతో రాహుల్ చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి వెళ్లినట్లు సమాచారం. త్వరగా వైద్యం అందించాలని కోరిన సమయంలో వైద్యుడు, సిబ్బందితో అతడికి వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సిబ్బంది టూ టౌన్ పోలీసులకు తెలియజేయడంతో రాహుల్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ పోలీసులు తనపై దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి ఇంటికి తిరిగొచ్చిన రాహుల్ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు పేర్కొంటున్నారు.

రాహుల్ మృతికి నిరసనగా కుటుంబ సభ్యులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు రిమ్స్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ఘటనకు దారితీసిన పరిణామాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, డీఎస్పీ జీవన్ రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాహుల్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఆసుపత్రిలో జరిగిన ఘటన, పోలీసులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. విచారణలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



మియాపూర్ భూములపై ప్రభుత్వానికి ఊరట


హైదరాబాద్, అక్టోబర్ 29:

మియాపూర్ భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూములపై ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దీంతో ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది.

2003లో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ వాదనలతో ఏకీభవిస్తూ అప్పీళ్లను తోసిపుచ్చింది. తాజా తీర్పుతో మియాపూర్ భూములకు సంబంధించి కొనసాగుతున్న న్యాయ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది.



పోలీసు అధికారులే టార్గెట్‌గా..



హైదరాబాద్, అక్టోబర్29:

సైదాబాద్ హనీట్రాప్ కేసులో కీలక నిందితుడు పవన్ కుమార్ పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. గే డేటింగ్ యాప్ 'గ్రైండర్', 'క్లబ్ జిందగీ' పేరుతో నిర్వహించిన వాట్సాప్ గ్రూప్ ద్వారా పరిచయాలు పెంచుకుని, ప్రైవేట్ వీడియోలు, ఫొటోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు సుమారు వెయ్యి మందితో చాటింగ్ చేయగా, 82 మందికి సంబంధించిన ప్రైవేట్ వీడియోలు, ఫొటోలను పోలీసులు గుర్తించారు.

ఈ వ్యవహారంలో పోలీసు అధికారులే బాధితులుగా ఉండటం కలకలం రేపుతోంది. డీఐ బాలస్వామి నుంచి రూ.7.5 లక్షలు, ఓ అదనపు డీసీపీ నుంచి రూ.3 లక్షలు, మరో ఏసీపీ నుంచి సుమారు రూ.5 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఏడాదిన్నర కాలంలో వివిధ మార్గాల్లో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు కాజేసినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

యువతుల పేర్లతో నకిలీ ప్రొఫైళ్లు సృష్టించి పరిచయాలు పెంచుకోవడం, ఆ తర్వాత వేధింపుల పేరుతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడం ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. మరికొందరిని కుటుంబ సభ్యుల అనారోగ్యం పేరుతో భావోద్వేగపరంగా ఒత్తిడికి గురిచేసి నగదు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. శబరిమల అయ్యప్ప స్వామి, తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో వీఐపీ దర్శనాలు చేయిస్తానంటూ భక్తులను మోసం చేసినట్లు కూడా గుర్తించారు. నిందితుడికి చెందిన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ ఖాతాలను పోలీసులు స్తంభింపజేశారు. వాటిలోని రూ.2 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. పవన్‌పై సైదాబాద్‌తోపాటు ఖైరతాబాద్/సైఫాబాద్, ఎస్సార్ నగర్, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్లలోనూ కేసులు నమోదయ్యాయి. కస్టడీ ముగియడంతో వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఈ నెట్‌వర్క్ వెనుక మరెవరైనా ఉన్నారా, ఇంకా ఎంతమంది బాధితులు ఉన్నారనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

హైదరాబాద్ రేస్ క్లబ్ సమీపంలో పేకాట స్థావరంపై దాడి

- **12 మంది జూదరులు పట్టివేత**
- **రూ.1.76 లక్షల నగదు స్వాధీనం**
- **నిర్వాహకులు సహా ముగ్గురు పరారీ**
- **గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు**



హైదరాబాద్, అక్టోబర్ 29:

హైదరాబాద్ రేస్ క్లబ్ పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై చాదర్‌ఘాట్ పోలీసులు దాడి చేశారు. మలక్‌పేట పరిధిలోని రేస్ క్లబ్ సమీపంలో ఉన్న జీపీ హబ్ భవనంలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు.

అక్టోబర్ 28న రాత్రి ఈ వ్యవహారంపై సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు, మలక్‌పేట ఏసీపీ అనుమతితో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. రాత్రి 10.30 గంటల సమయంలో స్వతంత్ర సాక్షుల సమక్షంలో భవనంపై ఆకస్మిక దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా రూ.1,76,170 నగదు, 16 మొబైల్ ఫోన్లు, నాలుగు సెట్ల పేక ముక్కలను స్వాధీనం చేసుకుంది.

పేకాట శిబిరం నిర్వహణలో కీలకంగా వ్యవహరించినట్లు భావిస్తున్న యాదయ్య, దేవాతో పాటు భవన యజమాని మహమ్మద్ గౌస్ పరారయ్యారు. వారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ ఘటనపై గేమింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4 కింద క్రైమ్ నంబర్ 423/2026తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖేలో ఇండియా గేమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- **ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు**
- **శాఖల మధ్య సమన్వయంతో ముందుకు**
- **ప్రారంభోత్సవానికి మోదీని ఆహ్వానించాలి**
- **కేంద్ర మంత్రితో మంత్రి వాకిటి శ్రీహరి చర్చలు**



న్యూదిల్లీ, అక్టోబర్ 29:

ఖేలో ఇండియా గేమ్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి జాతీయస్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సూచించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్దిష్ట సమయంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గేమ్స్ నిర్వహణపై న్యూదిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు. క్రీడా వేదికలు, మౌలిక సదుపాయాలు, వసతి, రవాణా, భద్రత, వైద్య సేవలు, సాంకేతిక ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని వాకిటి కోరారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి సహా పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సిటి పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు

- **38 కేంద్రాల్లో నిర్వహణ**
- **సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రారంభించిన డీజీపీ ఆనంద్**
- **పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు**



హైదరాబాద్, అక్టోబర్ 29:

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల మహోన్నత త్యాగాలకు నివాళిగా హైదరాబాద్ సిటీ పోలీస్ గురువారం మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసింది. రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు, తలసేమియా చిన్నారులు, క్యాన్సర్ రోగుల అత్యవసర చికిత్సలకు అండగా నిలిచేందుకు నగరవ్యాప్తంగా 38 కేంద్రాల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టింది. సుమారు 30 బ్లడ్ బ్యాంకుల సహకారంతో దాదాపు 5,700 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఈ శిబిరాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా పేట్లబురుజులోని సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన కేంద్రాన్ని డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు నగర పౌరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 31 వరకు అమరవీరుల స్మరణార్థం రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ రక్షణ కోసం పండుగలు, సెలవులను సైతం విడిచిపెట్టి పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం త్యాగనిరతి చాటుకుంటున్నారని కొనియాడారు. ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని ఉద్యమంలా చేపట్టి, సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌కు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధితులకు, ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం సంజీవనిలా ఉపయోగపడుతుందన్నారు. నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరిస్తూ వారికి నిజమైన నివాళి అర్పించాలనే సంకల్పంతోనే పెద్దఎత్తున ఈ శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మహత్కార్యానికి సహకరించిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్, కింగ్ కోఠి, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్స్, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులకు, అలాగే రెడ్ క్రాస్, తలసేమియా ఫౌండేషన్, రోటరీ, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలకు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ (క్రైమ్) ఎం.శ్రీనివాసులు, అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) తప్సీర్ ఇక్బాల్ ఐపీఎస్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, డీసీపీ (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్) ఆర్.వెంకటేశ్వర్లు ఐపీఎస్, శ్రీ. రాహుల్ హెగ్డే ఐపిఎస్ డిసిపి ట్రాఫిక్, విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్యనాయక్ జాదవ్ గారితో పాటు అన్ని జోన్ల డీసీపీలు, ఇతర అధికారులు, బ్లడ్ బ్యాంకులకు చెందిన వైద్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఫార్మసీలపై టీజీ సేఫ్ కొరడా

- **106 మెడికల్ షాపుల్లో తనిఖీలు**
- **32 దుకాణాలకు షోకాజ్ నోటీసులు**
- **ప్రిస్క్రిప్షన్లు, రిజిస్టర్ల నిర్వహణలో లోపాలు**
- **నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు**

హైదరాబాద్, అక్టోబర్ 29:

ఆన్‌లైన్ ఔషధ విక్రయాల పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తున్న మెడికల్ షాపులపై తెలంగాణ ఆహార, నిత్యావసర ఔషధాల ప్రమాణాల ప్రాధికార సంస్థ (టీజీ సేఫ్) డ్రగ్స్ విభాగం చర్యలకు దిగింది. అక్టోబర్ 28న 'క్యూర్' ప్రాంత పరిధిలో ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీ సంస్థలు, వాటి అనుబంధ ఫార్మసీలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. టీజీ సేఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 అమలును పరిశీలించారు.

టాటా 1ఎంజీ, నెట్‌మెడ్స్, జెప్టో, అపోలో 24/7, మెడ్‌ప్లస్ మార్ట్, ఇన్‌స్టామార్ట్ వంటి సంస్థలతో సంబంధం ఉన్న ఫార్మసీలతో పాటు మొత్తం 106 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల విక్రయ బిల్లులు చూపకపోవడం, కొనుగోలు రసీదులు లేకపోవడం, ప్రిస్క్రిప్షన్ ఔషధాలు, షెడ్యూల్ హెచ్1 మందులకు సంబంధించిన రిజిస్టర్లు నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు.

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయించడం, అర్హత కలిగిన ఫార్మసిస్టుల పర్యవేక్షణ లేకుండా ఔషధాలు అందించడం, కొనుగోలు-అమ్మకాల రికార్డులను సక్రమంగా భద్రపరచకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన 32 మెడికల్ షాపులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. చట్ట ప్రకారం తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ డెలివరీ సంస్థలతో అనుబంధం ఉన్నా ఔషధ విక్రయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. వ్యసనానికి దారితీసే మందుల అక్రమ విక్రయాలు, మళ్లింపులు, ఆన్‌లైన్ ఔషధ విక్రయాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18005996969ను సంప్రదించాలని టీజీ సేఫ్ సూచించింది. పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది.



నిమ్స్‌లో అవినీతి బాగోతం

హైదరాబాద్, అక్టోబర్ 29:

నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో అవినీతి వ్యవహారాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దృష్టి సారించారు. వైద్యుడు లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన వ్యవహారంలో భాగంగా ఆసుపత్రిలో మరోసారి విస్తృత తనిఖీలు చేపట్టారు. పరిపాలనా విభాగంలో అక్రమ వసూళ్లు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైన నేపథ్యంలో కీలక రికార్డులను పరిశీలిస్తున్నారు.

నిమ్స్ ప్రాంగణంలోని ఫలహారశాలలు, ఔషధ విక్రయ కేంద్రాల నిర్వాహకుల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు ముడుపులు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. చికిత్స పరికరాల విభాగాలు, మందుల దుకాణాలు, ఫలహారశాలల నుంచి కొందరు అధికారులు నెలవారీగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో నిమ్స్ పరిపాలనా విభాగంలోని దస్త్రాలు, రికార్డులను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు ఫలహారశాలలో నలుగురు అధికారులు తనిఖీలు నిర్వహించారు. శస్త్రచికిత్స సామగ్రి నిల్వ కేంద్రంలో మందులు, వైద్య పరికరాల నిల్వలను ఔషధ నియంత్రణ శాఖకు చెందిన నలుగురు అధికారుల బృందం పరిశీలిస్తోంది. ఏసీబీ, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ శాఖల బృందాలు సంయుక్తంగా సోదాలు నిర్వహిస్తూ కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నాయి. నిమ్స్‌లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సమగ్ర నివేదిక రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



కేటీఆర్‌పై వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న కొండా సురేఖ

- **గత ఆరోపణలపై మాజీ మంత్రి వెనక్కి తగ్గిన వైనం**
- **కేటీఆర్, కుటుంబాన్ని బాధపెట్టే ఉద్దేశం లేదని స్పష్టీకరణ**
- **నిరాధార వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని వ్యాఖ్య**
- **సోషల్ మీడియా వేదికగా విచారం వ్యక్తం**

హైదరాబాద్, అక్టోబర్ 29:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను మాజీ మంత్రి కొండా సురేఖ ఉపసంహరించుకున్నారు. టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ జంట విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ గతంలో ఆమె చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. తాజాగా ఈ అంశంపై స్పందించిన ఆమె.. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే తాను ఆ వ్యాఖ్యలు చేశానని, ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదని కొండా సురేఖ పేర్కొన్నారు. నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కేటీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. కేటీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం కూడా లేదన్నారు. తన వ్యాఖ్యలతో వారు నొచ్చుకుని ఉంటే చింతిస్తున్నానని పేర్కొంటూ గతంలో చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుంటున్నట్లు ట్వీట్‌లో వెల్లడించారు.

లాఠీలకు భయపడొద్దు..
మార్చ్‌పై వెనక్కి తగ్గేదేలే!

- నవంబర్ 1న ఢిల్లీలో చలో రామ్‌లీలా మార్చ్
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపు
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం
- విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని విజ్ఞప్తి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 29:

'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న చలో రామ్‌లీలా మార్చ్‌పై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పోలీసుల చర్యలకు, లాఠీలకు భయపడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోవడం కోసం చేపట్టిన ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో కోరారు.

ఈ మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, దేశ ఆత్మకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరితో విసిగిపోయినవారు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, భావప్రకటనా స్వేచ్ఛపై దాడి జరుగుతోందని భావించే విద్యార్థి సంఘాలు సైతం మార్చ్‌లో భాగస్వాములు కావాలని కోరారు.

దేశం కోసం, పౌరుల హక్కుల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎలాంటి ఆందోళన లేకుండా పాల్గొనాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో జరగనున్న ఈ ర్యాలీకి కాంగ్రెస్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూటమి ఎంపీలతో సమావేశమై కార్యక్రమంపై చర్చించారు.

జాతీయ పరీక్షల సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీ దృష్టి


- నీట్ సహా ప్రజా పరీక్షల నిర్వహణపై సమీక్ష
- కోచింగ్ సెంటర్ల నిబంధనల అమలుపై పరిశీలన
- జాతీయ విద్యా విధానం అమలుపై అధ్యయనం
- విద్యారంగంలో ఏఐ ప్రభావంపైనా సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:

జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పారదర్శకత, లోపాల నివారణపై పార్లమెంటరీ స్థాయి సంఘం దృష్టి సారించింది. నీట్‌యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ వివాదం, 2026 పరీక్ష రద్దు నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో అవసరమైన సంస్కరణలను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించింది. కోచింగ్ సెంటర్ల పనితీరు, వాటికి సంబంధించిన నిబంధనలు, వాటి అమలు తీరును కూడా పరిశీలించనుంది.

2026-27 సంవత్సరానికి సమీక్షాంశాలను ఎంపిక చేసుకున్న విద్యా, మహిళా, శిశు, యువజన, క్రీడల శాఖల పార్లమెంటరీ కమిటీ జాతీయ విద్యా విధానం-2020 అమలుపైనా అధ్యయనం చేయనుంది. ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ పనితీరు, గుర్తింపు నిబంధనలు, పరీక్షల నిర్వహణతో పాటు వాటి విదేశీ కార్యకలాపాలను సమీక్షించనుంది. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వ్యవహారాలనూ పరిశీలించనుంది.

పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, మానసిక సంక్షేమం, సమ్మిళిత విద్య, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు అందుతున్న సహాయక సేవలు ఎంతవరకు సమర్థంగా పని చేస్తున్నాయో అంచనా వేయనుంది. విద్యారంగంలో కృత్రిమ మేధ (ఏఐ), నూతన సాంకేతిక



తల ప్రభావం, వాటి ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తు ఉద్యోగావకాశాలపై ప్రభావాన్ని కూడా అధ్యయనం చేయనుంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, విదేశీ విశ్వవిద్యాలయాల కార్యకలాపాలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన నిబంధనలు, మార్గదర్శకాల అమలును సైతం సమీక్షించనుంది. పరీక్షల నిర్వహణలో సంస్థాగత లోపాలను గుర్తించి, కోచింగ్ వ్యవస్థపై పర్యవేక్షణను మెరుగుపరచడం వంటి అంశాలు ఈ సమీక్షలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. దేశవ్యాప్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు న్యాయబద్ధమైన పరీక్షా విధానం అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పరిశీలన కీలకంగా మారనుంది.

జామియాలో విద్యార్థి సంఘం కోసం ఆందోళన

- 2006 నుంచి జరగని యూనియన్ ఎన్నికలు
- డిసెంబర్ 20లోగా ఎన్నికలకు కమిటీ ఏర్పాటు
- నిరసనలతో క్యాంపస్‌లో ఉద్రిక్తత
- ఆన్‌లైన్‌లోకి తరగతులు.. విద్యార్థుల అసంతృప్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:

ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో ఆందోళనలు ఉధృతమయ్యాయి. 2006 నుంచి ఎన్నికలు జరగకపోవడంతో విద్యార్థులు నిరసనలు, నిరాహార దీక్షలు చేపట్టారు. అరెస్టయిన విద్యార్థులను విడుదల చేయాలని, తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ప్రొక్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్ 26న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మజహర్ ఆసిఫ్ నేతృత్వంలోని యాజమాన్యంతో జరిగిన చర్చల్లో డిసెంబర్ 20లోగా ఎన్నికలు నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే అధికారిక నోటిఫికేషన్ వెలువడకపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆహారం, తాగునీరు, మందుల సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. నిరసనల నేపథ్యంలో యూనివర్సిటీ యాజమాన్యం నవంబర్ 24 వరకు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఆడ్ సెమిస్టర్ పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి



12 తర్వాత ప్రత్యక్ష తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది. అయితే ప్రాక్టికల్ కోర్సుల విద్యార్థులు ఈ నిర్ణయంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైపు, విద్యార్థులతో చర్చలు జరిపినా సానుకూల స్పందన రాలేదని యాజమాన్యం పేర్కొంటోంది.

నసీరుద్దీన్ షాపై కిరణ్ రిజిజు విమర్శలు


- నటుడిని 'అర్బన్ దిమాగీ నక్సల్'గా అభివర్ణించిన కిరణ్ రిజిజు
- జామియా విద్యార్థుల ఆందోళనకు నసీరుద్దీన్ షా మద్దతు
- ప్రభుత్వంపై నటుడి విమర్శలు.. షైనా ఎన్‌సీ ప్రశ్నలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:

బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మధ్య మాటల యుద్ధం మొదలైంది. విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. నటుడిని 'ప్రమాదకరమైన అర్బన్ దిమాగీ నక్సల్'గా అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. ఒకప్పుడు నసీరుద్దీన్ షాను గౌరవించేవాడినని, అయితే ఆయన అసలు వైఖరి ఆలస్యంగా తెలిసిందని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా నసీరుద్దీన్ షా సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశారు. 'దిమాగీ నక్సల్' అని రాసి ఉన్న బ్యాడ్జ్ ధరించి, విద్యా వ్యవస్థను దెబ్బతీసేందుకు, యువత ధైర్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తనలాంటి వారిని దేశద్రోహులు, 'తుక్డే తుక్డే గ్యాంగ్'గా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు.

ఈ వివాదంపై శివసేన నాయకురాలు షైనా ఎన్‌సీ కూడా స్పందించారు. 'సర్ఫరోష్' సినిమాలోని ఏసీపీ రాథోడ్ తరహాలో ఆలోచిస్తున్నారా? లేక ప్రతినాయకుడు గులామ్ హసన్ తరహాలోనా? అని నసీరుద్దీన్ షాను ప్రశ్నించారు. ఆయన దేశానికి అనుకూలమా, వ్యతిరేకమా అన్నది స్పష్టం చేయాలని వ్యాఖ్యానించారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'దిమాగీ నక్సల్' పదాన్ని ఉపయోగించారు. వ్యవస్థలోకి ప్రవేశించి విధానాలను తప్పుదోవ పట్టించే వ్యక్తులను ఉద్దేశించి ఈ పదాన్ని వాడారు. NEET పరీక్షలో అక్రమాలు, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్లలో విద్యార్థుల నిరసనల అంశాలపై కూడా నసీరుద్దీన్ షా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీడియోలు విడుదల చేస్తున్నట్లు సమాచారం.



బ్యాంకులో రూ.35 కోట్ల గోల్‌మాల్!

- ఖాతాదారులకు తెలియకుండానే నగదు మాయం
- విజేంద్ర సింగ్ ఖాతాలో రూ.87 లక్షల నుంచి రూ.లక్షకు తగ్గిన నిల్వ
- బ్రాంచ్ మేనేజర్ సహా ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- 18 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు

గ్రేటర్ నోయిడా, అక్టోబర్ 29:

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా పంజాబ్ నేషనల్ బ్యాంకు శాఖలో సుమారు రూ.35 కోట్ల మేర నిధుల గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఖాతాదారులకు తెలియకుండానే సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాల నుంచి నగదు మాయమైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. విజేంద్ర సింగ్ ఖాతాలో గతంలో రూ.87 లక్షలకు పైగా ఉండగా, ప్రస్తుతం రూ.లక్ష మాత్రమే మిగిలింది. మరో ఇద్దరి ఖాతాల నుంచి వరుసగా రూ.39 లక్షలు, రూ.9.5 లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితులు బ్యాంకు ఎదుట నిరసనకు దిగారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకు యాజమాన్యం బ్రాంచ్ మేనేజర్‌తో సహా ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది. ఇప్పటివరకు 18 మంది ఫిర్యాదు చేయగా, మోసం జరిగిన మొత్తం మరింత పెరిగే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఖాతాదారులు ఎలాంటి విత్‌డ్రాయల్ ఫారాలు నింపలేదని, లావాదేవీలకు సంబంధించిన సందేశాలు కూడా అందలేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నగదు బదిలీలు ఎలా జరిగాయి, వాటి వెనుక ఎవరున్నారు అనే కోణాల్లో విచారణ సాగుతోంది. అవినీతి నిరోధక విభాగానికి ఫిర్యాదు చేసేందుకు కూడా బాధితులు సిద్ధమవుతున్నారు. ఖాతాదారుల సొమ్మును తిరిగి ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని బ్యాంకు యాజమాన్యం హామీ ఇచ్చింది.

కర్ణాటకలో ఓటర్ల జాబితా సవరణ పారదర్శకం

- ఎలాంటి అక్రమాలు జరగలేదు: మంత్రి సతీష్ జార్కిహోళి
- కోటి మంది పేర్ల తొలగింపును సమర్థించిన మంత్రి
- బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రల ప్రక్రియపై అభ్యంతరాలు
- బోగస్ ఓట్ల ఏరివేతే లక్ష్యమని వెల్లడి

బెంగళూరు, అక్టోబర్ 29:

కర్ణాటకలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఎలాంటి అక్రమాలు, గందరగోళం లేకుండా పారదర్శకంగా జరిగిందని రాష్ట్ర కాంగ్రెస్ మంత్రి సతీష్ జార్కిహోళి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో దాదాపు కోటి మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైనవారి పేర్లనే తొలగించినట్లు వివరించారు. అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగలేదని, బోగస్ ఓట్లను తొలగించేందుకు ఈ సవరణ దోహదపడిందని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ విధానంపై తమకు వ్యతిరేకత లేదని, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రల్లో దాన్ని అమలు చేసిన తీరుపైనే అభ్యంతరాలున్నాయని మంత్రి తెలిపారు. కర్ణాటకలో ముందుగానే నిరసనలు వ్యక్తం చేయడంతోపాటు సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వడం వల్ల ప్రక్రియ సక్రమంగా సాగిందన్నారు.



శాంతి ఒప్పందంపై నేహా బోరా నిరాకరణ

- నవంబర్ 20న ఎస్ఈఎం కోర్టుకు హాజరు కావాలని ఆదేశం
- ఆరు ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తు పత్రాలు అందజేత
- నిరసన హక్కును అణచివేస్తున్నారంటూ నేహా బోరా అభ్యంతరం
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మొదలైన వివాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:

ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా శాంతి ఒప్పందంపై సంతకం చేసేందుకు నాలుగోసారి నిరాకరించడంతో ఢిల్లీ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు ఆమెకు సమన్లు జారీ చేసింది. నవంబర్ 20న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. శాంతియుత నిరసన తెలపడం నేరం కాదని, పీస్ బాండ్ పేరుతో భావప్రకటన స్వేచ్ఛ, నిరసన హక్కులను అణచివేస్తున్నారని నేహా బోరా వాదిస్తున్నారు.

ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఆరు ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తు పత్రాలను నేహా బోరాకు అందించాలని ఎస్ఈఎం కోర్టు ఆదేశించింది. శాంతిభద్రతలకు భంగం కలగవచ్చని పోలీసులు భావించడానికి ఆధారమైన పత్రాలను అందజేయాలని స్పష్టం చేసింది. పోలీసులు ఆ డాక్యుమెంట్లను ఆమెకు అప్పగించారు. అంతకుముందు అక్టోబర్ 23న పోలీసులు జారీ చేసిన షోకాజ్ నోటీసులు, సమన్లను రద్దు చేయాలని నేహా బోరా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆమె పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

ఈ వ్యవహారం అక్టోబర్ 16న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు పిలుపునివ్వడంతో ప్రారంభమైంది. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు ఉన్నప్పటికీ అక్కడికి వెళ్లేందుకు, ఇతరులను ప్రేరేపించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో పోలీసులు నేహా బోరాపై చర్యలకు సిఫార్సు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 126 కింద చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ నేపథ్యంలో శాంతి ఒప్పందంపై సంతకం చేయాలని పోలీసులు ఆమెను ఆదేశించారు. అయితే, ఇది ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని నేహా బోరా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 20న విచారణ సందర్భంగా ఎస్ఈఎం కోర్టు తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ పాటించాలి

- ఉగ్రవాద ప్రోత్సాహక దేశాలపై కఠిన వైఖరి: రాజ్‌నాథ్ సింగ్
- భారత్-అమెరికా పదేళ్ల రక్షణ ఒప్పందంపై సమీక్ష
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం: పీట్ హెగ్‌సెత్

సెబూ, అక్టోబర్ 29:

ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చే, శిక్షణ అందించే, నిధులు సమకూర్చే దేశాల పట్ల ప్రపంచ దేశాలు ఉపేక్ష చూపకూడదని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలపై జీరో టాలరెన్స్ విధానం అనుసరించాలని పిలుపునిచ్చారు. ఫిలిప్పీన్స్‌లోని సెబూలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌తో బుధవారం జరిగిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్‌కు అమెరికా మద్దతు కొనసాగుతుందని హెగ్‌సెత్ తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో అమెరికా అందిస్తున్న సహకారానికి రాజ్‌నాథ్ సింగ్ కృతజ్ఞతలు చెప్పారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ సహకార ఒప్పందం అమలులో పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. సైనిక సాంకేతికత, సమాచార మార్పిడి, రక్షణ పరికరాల ఉమ్మడి తయారీ, సైనిక దళాల మధ్య సమన్వయం, సముద్ర భద్రత వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల నిర్వహించిన 'యుద్ధ్ అభ్యాస్' సంయుక్త సైనిక విన్యాసాలను కూడా ప్రస్తావించారు. స్వచ్ఛాయుత, బహిరంగ, సురక్షిత ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణంలో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశం అద్భుతంగా సాగిందని రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఆసియాన్ సభ్య దేశాలు, వాటి సంభాషణ భాగస్వామ్య దేశాల సమావేశంలో పాల్గొనేందుకు ఇరువురు నేతలు సెబూకు వెళ్లారు. భారత్-అమెరికా ప్రధాన రక్షణ భాగస్వామ్యానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించినట్లు అమెరికా ప్రకటన వెల్లడించింది. సైనిక కార్యకలాపాల్లో సమన్వయం, సమాచార భాగస్వామ్యం, రక్షణ పరిశ్రమల మధ్య సహకారాన్ని విస్తరించేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటంతో పాటు ప్రాంతీయ భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఇరు దేశాల రక్షణ సంబంధాల్లో కీలకంగా నిలిచాయి.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- **తాగునీరు, విద్యుత్తు పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి**
- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

శెనార్తి మీడియా, కరీంనగర్:



ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి లభ్యత, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, విద్యుత్తు పొదుపుపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ ఐడీఓసీలో వి.బి.జీ రామ్ జీ పథకం పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జలసిరి పనులను వేగవంతం చేయాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టం పెరిగేలా అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.

బోర్ల రీఛార్జిపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి బోర్లకు రీఛార్జి కల్పించే పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. నీటి వనరులను కాపాడటంతో పాటు జలసిరి పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

విద్యుత్తు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు

విద్యుత్తు సరఫరా, వినియోగంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు, వాణిజ్య సంస్థలు, వర్తక సంఘాలకు విద్యుత్తు పొదుపు ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు తాగునీరు, విద్యుత్తు వంటి కనీస అవసరాలు నిరంతరం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

వీబీజీ రామ్ జీ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు మత్స్యశాఖకు సంబంధించిన రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ భవనాలు, హాస్టళ్లు, సామూహిక అపార్ట్‌మెంట్లతో పాటు నీటి నిల్వకు అనువైన వివిధ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పంట మార్పిడితోనే రైతులకు ప్రయోజనం

- **ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలి**
- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

శెనార్తి మీడియా, వీణవంక(హుజూరాబాద్):



ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యమివ్వాలని, దీర్ఘకాలికంగా ఆదాయం అందించే ఆయిల్ ఫామ్ సాగును విస్తరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే పరిస్థితులు ఉన్నందున వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయలు, పప్పు దినుసులు, నూనె గింజల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. వీణవంక మండలంలోని ఘన్ముకుల, పోతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న గుడిపాటి శివారెడ్డి, మాడ సమ్మిరెడ్డి, కూరగాయలు పండిస్తున్న కారుపాకల శ్రీనివాస్‌తో మాట్లాడి సాగు విధానం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ సదుపాయం, పెట్టుబడి, మార్కెటింగ్, ప్రభుత్వ రాయితీల వివరాలు తెలుసుకున్నారు. మంచి ఫలితాలు సాధిస్తున్న రైతులను అభినందించారు. ఆయిల్ ఫామ్ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, ఉద్యానవన, వ్యవసాయ శాఖలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తెలంగాణ ఆయిల్ ఫెడరేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు వచ్చే వారంలో ఖమ్మం, నర్మెట్ల ప్రాంతాలకు రైతులతో క్షేత్రస్థాయి పర్యటనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. బిందు సేద్యం, ప్రభుత్వ రాయితీలు, నాణ్యమైన మొక్కలు, ఎరువుల వినియోగంపై రైతులకు వివరించాలని ఆదేశించారు. ఇప్పటికే లాభదాయకంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతుల తోటలను ఇతర రైతులతో సందర్శింపజేయాలని సూచించారు. పంట మార్పిడిలో భాగంగా మండలాల వారీగా అనుకూలమైన పంటలను గుర్తించి కార్యాచరణ సిద్ధం చేయాలని, సర్పంచులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నీటి నిర్వహణ, మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ పర్యటనలో హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి, డీహెచ్ఎస్ఓ జగన్మోహన్ రెడ్డి, ఆయిల్ ఫెడరేషన్ డీఎం రోహిత్, ఏడీఏ సునీత, హార్టికల్చర్ ఆఫీసర్ మధులిక, ఎంఏహో భూమిరెడ్డి, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు కేశవపట్నం విద్యార్థిని

శెనార్తి మీడియా, శంకరపట్నం:



ఉమ్మడి కరీంనగర్ బాలికల వాలీబాల్(జిల్లా అండర్-17) పోటీలకు కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సయ్యద్ సానియా ఎంపికైంది. అక్టోబర్ 30న సుల్తానాబాద్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరఫున సానియా ప్రాతినిధ్యం వహించనుందని పీఈటీ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని ఎంపికపై పాఠశాల హెచ్ఎం సుభాష్, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఉపసర్పంచ్ విజయకుమార్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సానియాను అభినందించారు.

శంకరపట్నాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



- **బీజేపీ నాయకుల రాస్తారోకో..**
- **తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**

శెనార్తి మీడియా, శంకరపట్నం:

పంటలు ఎండిపోయి, సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న శంకరపట్నం మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని, రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో గురువారం కేశవపట్నంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కరువు పరిస్థితులు ఎమ్మెల్యేకు కనిపించడం లేదా?

మండలంలో రైతులు సాగుకు దూరమవుతూ, పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాడ వెంకటరెడ్డి విమర్శించారు. కరువు పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతుంటే మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రైతుల కష్టాలు ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కరువు మండలాల ఎంపికలో సరైన గణాంకాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. అత్యల్ప వర్షపాతం నమోదై, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న శంకరపట్నం మండలాన్ని జాబితాలో చేర్చకపోవడం అన్యాయమన్నారు.

యాసంగిసాగుపైనా నీటి కొరత ప్రభావం

కాకతీయ కాలువ దిగువ ప్రాంతంలో శంకరపట్నం మండలానికి ప్రస్తుత వానకాలం సీజన్‌లో కాలువ ద్వారా ఒక్కసారి కూడా నీరు విడుదల చేయలేదన్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయని, రాబోయే రబీ సీజన్‌లోనూ కాలువ నీరు అందే పరిస్థితి లేకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు ప్రత్యామ్నాయ సాగునీటి వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి రైతులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో బీజేపీ జిల్లా నాయకులు అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, నాయకులు దొంగల రాములు, జంగ జైపాల్, రాసమల్ల శ్రీనివాస్, కొయ్యడ అశోక్, మందాడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, చెర్ల శ్రీనివాస్, నిమ్మశెట్టి సంపత్, సోషల్ మీడియా కన్వీనర్,కునారపు శ్రీనాథ్ వివిధ మోర్చాల మండల విభాగం అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లాస్యను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



శెనార్తి మీడియా, మానకొండూర్:

మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన కొమ్ము అంజలి-చంద్రయ్య దంపతుల కుమార్తె లాస్య నూతన వస్త్రాలంకరణ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బాలికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రెమిడి శ్రీనివాస్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రంగపేట సర్పంచ్ కొత్త రాంరెడ్డి, ఉపసర్పంచ్ వేల్పుల కొమురయ్య యాదవ్, మద్దికుంట సర్పంచ్ బుర్ర శ్రీధర్, సహకార సంఘం డైరెక్టర్ గోపు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మహేందర్ గౌడ్, గుడాల శ్రీనివాస్ గౌడ్, కంకణాల రవీందర్ రెడ్డి, నాగుల సంపత్‌తో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



శెనార్తి మీడియా, శంకరపట్నం: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గురువారం శంకరపట్నం మండలంలోని తాడికల్, కొత్తగట్టు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, సన్న ధాన్యానికి క్వింటాలుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌ను పొందాలని కోరారు. తూకాల్లో మోసాలు, తాలు, తరుగు పేరుతో కోతలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ సురేఖ, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, గట్టు తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు కీసర సంపత్, గాజుల మహేష్ కుమార్, గోపగోని బస్వయ్య గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

శెనార్తి మీడియా, శంకరపట్నం:



రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మండలంలో మొదటి విడతలో 554, రెండో విడతలో 250 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 50 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. శంకరపట్నం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సర్పంచులు కోరగా, 94 శాతం వర్షపాతం నమోదవడంతో పాటు భూగర్భ జలమట్టం ఎనిమిది మీటర్ల వద్ద ఉండటంతో జాబితాలో చేర్చలేదని ఎమ్మెల్యే వివరించారు. కల్వల ప్రాజెక్టు మరమ్మతులకు 2024లో రూ.78 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపగా, బడ్జెట్ పరిమితుల వల్ల నిధులను 50 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. త్వరలో అనుమతులు వస్తాయని, రైతులు స్వల్పకాలిక ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో అనిత తాసిల్దార్ సురేఖ ఏవో వెంకటేష్ పశువైద్యాధికారి మాధవరావు వివిధ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

అర్కండ్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి

శెనార్తి మీడియా, శంకరపట్నం: శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ నేదురు పవన్, వార్డు సభ్యులు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రాలు అందజేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడకుండా గ్రామంలో రెండు కొత్త బోర్లు, ఒక మంచినీటి బావి మంజూరు చేయాలని కోరారు. అలాగే వీర మల్లమ్మ ఇంటి నుంచి డంపింగ్ యార్డు వరకు సీసీ డ్రైనేజీ, మరో ప్రాంతంలో 300 మీటర్ల డ్రైనేజీ, గ్రామం నుంచి శ్మశానవాటిక వరకు కిలోమీటరు సీసీ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో 1,000 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అభివృద్ధి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శెనార్తి మీడియా, దుబ్బాక:

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకం చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భవాని తెలిపారు. కళాశాలలో భౌతికశాస్త్రం విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హత ధ్రువపత్రాల ప్రతులను జతచేసి అక్టోబర్ 30 సాయంత్రంలోగా కళాశాల అడ్మిని స్ట్రేషన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు సెట్, నెట్ లేదా పీహెచ్‌డీ అర్హతలు ఉన్నవారికి నియామకంలో ప్రాధాన్యత ఇస్తామని ప్రిన్సిపల్ వెల్లడించారు.

శంకరపట్నం పీహెచ్‌సీలో డిప్యూటీ డీహెచ్ఓ తనిఖీ



శెనార్తి మీడియా, శంకరపట్నం: శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీహెచ్ఓ ప్రభుదాసు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, రోగులతో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో డాక్టర్ కీర్తన, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ, బాలికల సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలి

శెనార్తి మీడియా, జగిత్యాల :

జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ (పీసీ, పీడీఎన్టి యాక్ట్ 1994) సమావేశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. సుజాత మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బాలికల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, లింగ నిష్పత్తి మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు బాలికల ప్రాధాన్యత, లింగ వివక్ష నిర్మూలన, బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ పీసీ, పీడీఎన్టి చట్టం1994 నిబంధనలు అమలయ్యేలా ప్రతి నెల పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.

యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి

ఆహార అలవాట్లు మీకు తెలుసా ?



యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం

కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలం దెబ్బతినే అవకాశం

ప్రస్తుతం కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో ఇబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. యూరిక్ యాసిడ్ అనేది మన రక్తంలో కనిపించే వ్యర్థ పదార్థం. శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్లకీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు

మనం తీసుకునే ఆహారంలోని ప్యూరిన్స్ అనే పదార్థాల విచ్ఛిన్నంలో భాగంగా యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. రక్తంలోని యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా విసర్జితమవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగినా, విసర్జన సరిగా జరగకపోయినా అది రక్తంలోనే నిలిచిపోయి స్ఫటికాలుగా కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలంలో చేరుతుంది. అప్పుడు కీలు వాచిపోయి, కదలికలు కష్టంగా మారతాయి. ఇది గౌట్‌కు దారితీస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, వంశపారంపర్యంగానూ యూరిక్ సమస్య ఎదురవుతుంది. యూరిక్ యాసిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. యూరిక్ యాసిడ్ మోతాదు పెరుగుదల శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను సృష్టించి, అన్ని అవయవాలనూ ప్రభావితం చేస్తుంది. దీనికారణంగా గుండె, కాలేయం, గాల్ బ్లాడర్, మూత్రపిండాల పనితీరుపై ప్రభావం పడుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూసేద్దాం.



ఒక టీస్పూన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో కలపండి. ఈ నీళ్లు రోజు తాగితే.. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ నేచురల్ క్లెన్సర్, డిటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో మాలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేయడానికి, తొలగించడానికి సహాయపడుతుంది. యాపిల్ పండ్లలోనూ మాలిక్ యాసిడ్ ఉంటుంది. రోజు ఒక యాపిల్ తిన్నా మేలు జరుగుతుంది.

ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజు కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి.



శరీరంలో అధికంగా పేరుకున్న నిమ్మరసాన్ని తొలగించడానికి రోజుకు కనీసం రెండుసార్లు నిమ్మరసం తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది, ఇది యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. మీ డైట్‌లో ఉసిరి, జామ, నారింజ వంటి విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకున్నా మేలు జరుగుతుంది.



ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది.

యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది.



రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది.




ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి





ఆలూ పొట్టులో అధిక పోషకాలు

బంగాళదుంపలు ఇష్టపడని వారు ఉండరేమో. ఈ ఆలుగడ్డలతో రకరకాల వంటను చేసుకొని లాగించేస్తుంటారు. అయితే బంగాళదుంప కూర.. లేదంటే చిప్స్, ఇతర వంటకాలు చేసేటప్పుడు.. పొట్టును తీసి పక్కకు పడేస్తుంటాము. అయితే ఆలుగడ్డల పొట్టులోనే అధిక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆలు తొక్కను తీసేస్తే చాలా పోషకాలు మిస్ అయిపోతామని నిపుణులు చెబుతన్నారు. తొక్కపై అంతా మట్టి, దుమ్ము ఉంటాయి కనుక పొట్టును తీసేయాల్సి వస్తుంది. అయితే వాస్తవానికి ఆలూను పొట్టుతో సహా తినాలి. పొట్టులో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్ ఉంటుంది. పొట్టులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది హైబీపీని తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది.



యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం

ఆలు పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతాయి. ఆర్థరైటిస్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అధిక బరువు సమస్య నుంచి బయట పడతారు. మెరిసే చర్మం మీ సొంతం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచైనా ఆలుగడ్డ తొక్కతో పండుకోవడానికి ప్రయత్నించండి. లేదంటే విలువైన పోషకాలు మిస్సవుతారు.

తల్లిదండ్రుల మనసు నొప్పించకండి..

ఈ ప్రశ్నలు అడిగి విసిగించకండి



తల్లిదండ్రులు చిన్నప్పుడు మనల్ని ఎలాగైతే కంటికి రెప్పలా కాపాడుకుంటారో.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను మనం కూడా అలాగే చూసుకోవాలి. అయితే ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది తల్లిదండ్రులను భారంగా భావిస్తున్నారు. ఒకవేళ వారి పేరిట ఆస్తిపాస్తులు ఉంటే తప్ప పట్టించుకోవడం లేదు. అయితే తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వారిని అనవసర ప్రశ్నలు అడిగి విసిగించొద్దంటున్నారు.



shutterstock.com - 231948

నిర్ణయాలపై ప్రశ్నించొద్దు?

తల్లిదండ్రులు గతంలో తీసుకున్న నిర్ణయాల గురించి వారిని పదే పదే ప్రశ్నించొద్దు.. ఆ నిర్ణయాల గురించి వారిని గుచ్చి గుచ్చి అడగడం.. ఫలానా పని ఎందుకు చేశారని నిలదీయం వారిని హర్ట్ చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

పోల్చడమూ మంచిది కాదు..

మనం పిల్లల్ని ఇతర పిల్లలతో పోల్చడం కరెక్ట్ కాదు.. అలాగే వృద్ధులైన తల్లిదండ్రులను ఫలానా వాళ్లతో పోల్చి మీరు వాళ్లకంటే ఎక్కువ ఎందుకు సంపాదించలేదు? వారిలా ఆస్తులు ఎందుకు కూడబెట్టలేదు.. అని అడగడం కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఓ విషయంలో ఫెయిల్ అవుతూనే ఉంటారు. దీని గురించి మళ్ళీ ప్రస్తావించకూడదు. వారి ఎక్స్ లవ్, మాజీ ప్రేమ, పెళ్ళి వంటి అంశాలను వారిని అడిగి బాధపెట్టొద్దు.

సంబంధాలు..

తల్లిదండ్రులు వారు ఎన్నో అనుభవాలని చూసే వచ్చారు. కానీ, వీటి గురించి ఆలోచించక చాలా మంది వారి సంబంధాల గురించి మాట్లాడతారు. వారి పర్సనల్, రొమాన్స్ గురించి మాట్లాడడం మంచిది కాదు. తల్లిదండ్రుల్ని ఎప్పుడైనా ఆర్థిక విషయాల గురించి ఆరా తీసి ఇబ్బంది పెడతారు కొంతమంది పిల్లలు. మీరు ఎంత డబ్బు సంపాదించారు? ఎవరికిస్తారు. వీలునామా రాశారా అంటూ ఆరాలు తీస్తారు. కానీ, ఇవి అంత మంచిది కాదు. వీని వారు ఇష్టముంటేనే చెప్పేలా చూసుకోండి.

డబ్ల్యూపీఎల్ వేలం పూర్తి

- ఐదు జట్ల స్క్వాడ్లు ఖరారు
- వేలంలో 25 మంది క్రీడాకారిణుల కొనుగోలు
- 18 మంది భారత ప్లేయర్లు.. ఏడుగురు విదేశీయులు
- ఎనిమిది మందితో యూపీ వారియర్జ్ టాప్
- ఆర్సీబీ, ఢిల్లీ జట్లలో 17 మందే



కొచ్చి వేదికగా బుధవారం జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 మినీ వేలం ముగిసింది. ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లలో మిగిలిన స్థానాలను భర్తీ చేసుకున్నాయి. వేలంలో మొత్తం 25 మంది క్రీడాకారిణులు అమ్ముడుపోగా.. వారిలో 18 మంది భారతీయులు, ఏడుగురు విదేశీ ప్లేయర్లు ఉన్నారు. కొనుగోళ్లలో యూపీ వారియర్జ్ ఎనిమిది మందిని దక్కించుకోగా, ముంబై ఇండియన్స్ ఆరుగురిని తీసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ చెరో నలుగురిని కొనుగోలు చేశాయి. గుజరాత్ జెయింట్స్ ముగ్గురితో సరిపెట్టుకుంది. డబ్ల్యూపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో జట్టులో గరిష్ఠంగా 18 మంది ఆటగాళ్లకు అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ 18 మందితో తమ జట్లను పూర్తి చేసుకున్నాయి. ఆర్సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం 17 మందితోనే సరిపెట్టుకున్నాయి. ముంబై ఇండియన్స్: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), నాట్ సివర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, అమేలియా కెర్, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజనా సజీవన్, రహిలా ఫిర్దౌస్, నికోలా కేరీ, వైష్ణవి శర్మ, తారా నోరిస్, దిశా కసత్, భారతి రావల్, లతిక ఇనామ్‌దార్, అక్షిత భగత్, శ్వేతా సెహ్రావత్, సానిక చాల్కే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), ఎలీస్ పెర్రీ, లారెన్ బెల్, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, నాడిన్ డి క్లర్క్, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, జార్జియా వోల్, జెస్ జొనాసెన్, తేజల్ హసబ్నిస్, సయాలీ సత్ఘరే, క్లోయ్ ట్రయాన్, ప్రేమ రావత్, వ్రిందా దినేష్, ప్రథ్యోష కుమార్. ఢిల్లీ క్యాపిటల్స్: జెమిమా రోడ్రిగ్స్ (కెప్టెన్), షెఫాలీ వర్మ, మరిజానే కాప్, నికీ ప్రసాద్, లారా వోల్వార్డ్ట్, చినెల్ హెన్రీ, శ్రీ చరణి, దీయా యాదవ్, మమతా మడివాలా, నందిని శర్మ, లూసీ హామిల్టన్, మిన్ను మణి, అన్నాబెల్ సదర్లాండ్, కిరణ్ నవ్‌గిరే, ఉమా ఛెత్రీ, కిర్టీ గోర్డాన్, నజ్మా ఖాన్. యూపీ వారియర్జ్: మెగ్ లానింగ్ (కెప్టెన్), దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, హర్లీన్ డియోల్, క్రాంతి గౌడ్, శిఖా పాండే, షిప్రా గిరి, సిమ్రాన్ షేక్, ప్రతీక రావల్, సోఫీ మోలినెక్స్, గ్రేస్ హ్యారిస్, సుష్మా వర్మ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, సహానా పవార్, మనాలి దక్షిణి, కేథరిన్ బ్రైస్, ఆశా శోభన. గుజరాత్ జెయింట్స్: యాష్లే గార్డ్‌నర్ (కెప్టెన్), బెత్ మూనీ, సోఫీ డివైన్, రేణుకా సింగ్ ఠాకూర్, భారతి ఫుల్‌మాలి, కాశ్వీ గౌతమ్, కనికా అహుజా, తనూజా కన్వర్, జార్జియా వేర్‌హామ్, అనుష్క శర్మ, హ్యాపీ కుమారి, కిమ్ గార్త్, యాస్తిక భాటియా, రాజేశ్వరి గైక్వాడ్, జింతిమణి కలిత, జి. కమలిని, ఓర్లా ప్రెండర్‌గాస్ట్, సమైరా రాఘవ్.

ముంబై ఇండియన్స్‌లో భారీ ప్రక్షాళన!

- కోచింగ్ బృందం నుంచి మలింగ, మాంబ్రే, హాప్‌కిన్‌సన్ నిష్క్రమణ
- కొత్త ప్రధాన కోచ్‌గా పొలార్డ్ బాధ్యతల తర్వాత కీలక మార్పులు
- ముంబైతో మలింగ సుదీర్ఘ అనుబంధానికి తెర
- భారత మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రేకూ వీడ్కోలు
- ఐపీఎల్ 2027 సీజన్‌కు కొత్త సహాయక బృందం ఏర్పాటుపై దృష్టి



ముంబై, అక్టోబర్ 29: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు సార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు కోచింగ్ విభాగంలో కీలక మార్పులు చేపట్టింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్ జట్టును వీడుతున్నట్లు ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ కొత్త ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాబోయే సీజన్‌కు ముంబై ఇండియన్స్ కొత్త సహాయక బృందాన్ని ఏర్పాటు చేసుకునే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీలంక మాజీ ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ జట్టును వీడటం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ప్రత్యేకమైన బౌలింగ్ శైలితో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన మలింగ, ముంబై ఇండియన్స్ నాలుగు ఐపీఎల్ టైటిళ్లు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 2011లో ఛాంపియన్స్ లీగ్ టీ20 విజయంలోనూ తనవంతు సహకారం అందించాడు. ఆటగాడిగా విశేష సేవలందించిన ఆయన ఆ తర్వాత కోచింగ్ విభాగంలోనూ కొనసాగాడు. 2018లో ముంబై ఇండియన్స్‌కు మార్గదర్శకుడిగా వ్యవహరించిన మలింగ, అనంతరం రాజస్థాన్ రాయల్స్ జట్టులో రెండేళ్లపాటు కోచింగ్ బాధ్యతలు నిర్వహించాడు. తొమ్మిదేళ్లపాటు ముంబై బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన షేన్ బాండ్ స్థానంలో 2024 సీజన్‌కు ముందు మళ్లీ ముంబై ఇండియన్స్‌లో చేరాడు. తాజాగా కోచింగ్ బృందం నుంచి ఆయన నిష్క్రమించడంతో ఆటగాడిగా, కోచ్‌గా ముంబైతో కొనసాగిన సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలికినట్లయింది. భారత జట్టు మాజీ ఫాస్ట్ బౌలర్ పరాస్ మాంబ్రే కూడా ముంబై ఇండియన్స్ కోచింగ్ బృందాన్ని వీడుతున్నారు. గతంలో రెండు విడతల్లో ముంబై జట్టుకు సేవలందించిన మాంబ్రే, భారత జాతీయ జట్టు బౌలింగ్ కోచ్‌గా కూడా పనిచేశారు. నవంబర్ 2021 నుంచి జూలై 2024 వరకు టీమిండియా బౌలింగ్ విభాగానికి మార్గదర్శకత్వం వహించారు. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సహాయక సిబ్బందిలో ఆయన ఒకరు. మరోవైపు ఇంగ్లండ్ జట్టు మాజీ ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్ కూడా ముంబై ఇండియన్స్ నుంచి నిష్క్రమిస్తున్నారు. 2025 సీజన్‌కు ముందు జట్టులో చేరిన ఆయన ఫీల్డింగ్ విభాగంలో బాధ్యతలు నిర్వహించారు. కోచింగ్ బృందాన్ని వీడుతున్న మలింగ, మాంబ్రే, హాప్‌కిన్‌సన్ సేవలను ముంబై ఇండియన్స్ యాజమాన్యం అభినందించింది. జట్టు విజయాల్లో, ఆటగాళ్ల అభివృద్ధిలో వారు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో వారు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించింది. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ముంబై ఇండియన్స్ సహాయక సిబ్బందిని పునర్‌వ్యవస్థీకరిస్తోంది. బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలకు కొత్త కోచ్‌ల నియామకంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌లో కొత్త కోచింగ్ బృందంతో బరిలోకి దిగేందుకు ముంబై ఇండియన్స్ సన్నాహాలు చేస్తోంది. ఖాళీ అయిన స్థానాల్లో ఎవరిని నియమిస్తారనే అంశంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.



విమానాశ్రయంలో సంగక్కరకు చేదు అనుభవం!

ర్యాన్‌ఎయిర్ సిబ్బందిపై వివక్ష ఆరోపణలు

డబ్లిన్ విమానాశ్రయంలో కుటుంబంతో కలిసి అవమానం ఎదుర్కొన్నానని ఆవేదన

డబ్లిన్, అక్టోబర్ 29 : శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కుమార సంగక్కరకు ఐర్లాండ్‌లోని డబ్లిన్ విమానాశ్రయంలో చేదు అనుభవం ఎదురైంది. ప్రముఖ విమానయాన సంస్థ ర్యాన్‌ఎయిర్ సిబ్బంది తనతోపాటు కుటుంబ సభ్యుల పట్ల వివక్షపూరితంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. విమానం ఎక్కే ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బెదిరింపు ధోరణితో మాట్లాడారని, ప్రయాణ నిబంధనలను అమలు చేసిన తీరు తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష గుర్తింపు పొందిన సంగక్కర విమానయాన సంస్థ సిబ్బందిపై బహిరంగంగా ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. డబ్లిన్ విమానాశ్రయంలో ఇలాంటి అనుభవం ఎదురుకావడం తనకు ఇదే తొలిసారని సంగక్కర పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో సిబ్బంది వ్యవహరించిన తీరు తమను తీవ్రంగా బాధించిందన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపించారు. నిబంధనల అమలు పేరుతో ప్రయాణికులను అవమానించేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. తన కుటుంబ సభ్యులు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం మరింత బాధ కలిగించిందని వెల్లడించారు. సంగక్కర చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ఆయన పోస్టుపై డబ్ల్యూఎస్ఓ2 సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజీవ వీరవర్న స్పందించారు. పాశ్చాత్య దేశాల్లోని పలు ప్రాంతాల్లో తాను కూడా వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై సంగక్కర స్పందిస్తూ, అలాంటి అనుభవం స్వయంగా ఎదురైనప్పుడు కలిగే బాధ తీవ్రంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రయాణికుల పట్ల విమానయాన సంస్థల సిబ్బంది వ్యవహరించే తీరుపై ఈ ఘటనతో మరోసారి చర్చ మొదలైంది. సంగక్కర చేసిన వివక్ష ఆరోపణలపై ర్యాన్‌ఎయిర్ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, సిబ్బంది వివరణ, నిబంధనల అమలుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంగక్కర ఆరోపణలపై విమానయాన సంస్థ ఎలాంటి వివరణ ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా ముంబై

ప్రతి ఫ్రాంచైజీ విలువ రూ.14,000 కోట్లకు పైనే!

ప్రపంచ క్రీడా యవనికపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తన అపారమైన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. తాజాగా ప్రముఖ సంస్థ 'స్పోర్టికో' విడుదల చేసిన నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.20,008 కోట్లు) అద్భుతమైన విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐపీఎల్ జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదిక ఆధారంగా ఐపీఎల్‌లోని ప్రతి ఫ్రాంచైజీ విలువ ప్రస్తుతం కనీసం 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14,292 కోట్లు) మైలురాయిని దాటడం విశేషం. బ్రాండ్ విలువ పరంగా ముంబై ఇండియన్స్ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 1.85 బిలియన్ డాలర్లతో (రూ.17,626 కోట్లు) రెండో స్థానంలో నిలవగా, చెన్నై సూపర్ కింగ్స్ 1.75 బిలియన్ డాలర్లతో (రూ.16,674 కోట్లు) మూడో స్థానంలో నిలిచింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 1.73 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో ఉండగా, ఢిల్లీ క్యాపిటల్స్ 1.7 బిలియన్ డాలర్లతో లీగ్ సగటు విలువకు సమానంగా నిలిచింది. మిగతా జట్లలో రాజస్థాన్ రాయల్స్ (1.65 బిలియన్ డాలర్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1.62 బిలియన్ డాలర్లు), గుజరాత్ టైటాన్స్ (1.58 బిలియన్ డాలర్లు), పంజాబ్ కింగ్స్ (1.53 బిలియన్ డాలర్లు) వరుస తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి ఫ్రాంచైజీల వ్యాపార విలువలో అసాధారణ వృద్ధి నమోదైంది. గత 18 ఏళ్ల కాలంలో లీగ్ ఫ్రాంచైజీల విలువ ఏకంగా 1,800% పెరిగింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ స్పోర్ట్స్ లీగ్‌లైన ఎన్ఎఫ్ఎల్ (800%), ఎన్బీఏ (1700% లోపు) వృద్ధి రేటు కంటే ఇది చాలా ఎక్కువ కావడం గమనార్హం. ముంబై ఇండియన్స్ మార్కెట్ విలువ కొన్ని ఉత్తర అమెరికా స్పోర్ట్స్ ఫ్రాంచైజీలైన డెట్రాయిట్ టైగర్స్, వాంకోవర్ కానక్స్ కంటే అధికంగా ఉండటం ఐపీఎల్ బ్రాండ్ ప్రాభవాన్ని స్పష్టం చేస్తోంది. ఐపీఎల్ జట్లకు ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ నుంచి వచ్చే సెంట్రల్ రెవెన్యూ పూల్. ముఖ్యంగా బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా హక్కుల ద్వారా బీసీసీఐకి భారీ ఆదాయం సమకూరుతుంది. ఇందులో సగం వాటాను బోర్డు ఉంచుకుని, మిగిలిన మొత్తంలో దాదాపు 90% అన్ని ఫ్రాంచైజీలకు సమానంగా పంచుతుంది. మరో 10% జట్ల ప్రదర్శన ఆధారంగా లభిస్తుంది. దీని ద్వారా ప్రతి ఫ్రాంచైజీకి ఏటా సుమారు 50-55 మిలియన్ డాలర్ల (రూ.476 కోట్ల నుంచి రూ.523 కోట్ల వరకు) అందుతాయి. ఇవి కాకుండా టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య భాగస్వామ్యాల ద్వారా కూడా జట్లు అదనపు రాబడిని పొందుతున్నాయి. ఆటగాళ్ల వేలం పరిమితులు, నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటంతో 30% కంటే ఎక్కువ లాభాల మార్జిన్‌తో ఐపీఎల్ జట్లు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులుగా మారాయి.



ఒత్తిడి బౌలర్‌కే.. నాకు కాదు!

తొలి బంతి నుంచే బాదేందుకు సిద్ధం: తిలక్ వర్మ

ఆక్లాండ్, అక్టోబర్ 29: చివరి ఓవర్లలో బ్యాటింగ్‌కు దిగినప్పుడు తనపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, అసలైన ఒత్తిడి బౌలర్‌పైనే ఉంటుందని భారత టీ20 జట్టు ఉపసారథి తిలక్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చుకున్నానని వెల్లడించాడు. గతంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి క్రీజులో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకునేవాడినని, ఇప్పుడు ఐదు లేదా ఆరో స్థానంలో ఫినిషర్‌గా వస్తుండటంతో తొలి బంతి నుంచే భారీ షాట్లు ఆడేందుకు సిద్ధమవుతున్నానని తెలిపాడు. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన తిలక్ తన కొత్త పాత్ర, బ్యాటింగ్ వ్యూహాలు, జట్టు లక్ష్యాలపై పలు విషయాలను వెల్లడించాడు. బ్యాటింగ్ స్థానంలో మార్పు తన ఆలోచనా విధానాన్ని మార్చిందని తిలక్ వర్మ తెలిపాడు. మూడో స్థానంలో ఆడేటప్పుడు పరిస్థితులను అర్థం చేసుకుని ఇన్నింగ్స్ నిర్మించేందుకు సమయం ఉండేదని, కానీ ఐదు, ఆరు స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు వేగంగా పరుగులు సాధించాల్సిన అవసరం ఉంటుందని వివరించాడు. అందుకే అవకాశం దొరికితే తొలి బంతినే బౌండరీకి తరలించేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు. పరిస్థితులు అనుకూలించకపోతే సింగిల్స్, డబుల్స్ తీస్తూ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నాడు. తనలో భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఎప్పటి నుంచో ఉందని, ప్రస్తుతం దానిని జట్టు అవసరాలకు అనుగుణంగా ఉపయోగిస్తున్నానని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో రెండో టీ20లో కేవలం 26 బంతుల్లో 51 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తిలక్ ఆ ఇన్నింగ్స్‌ను గుర్తుచేసుకున్నాడు. చివరి ఓవర్లలో బ్యాటర్ కంటే బౌలర్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుందని అభిప్రాయపడ్డాడు. ఒత్తిడిలో ఉన్న బౌలర్ పరుగులు ఇచ్చే అవకాశం ఉంటుందనే సానుకూల దృక్పథంతో బ్యాటింగ్ చేస్తానని తెలిపాడు. ఈ ఆలోచనే క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసంతో ఆడేందుకు ఉపయోగపడుతోందని వివరించాడు. రెండో టీ20లో నితీశ్ రెడ్డితో కలిసి ఏడో వికెట్‌కు 69 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన విషయాన్ని తిలక్ ప్రస్తావించాడు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న జట్టును గెలిపించడం ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని చెప్పాడు. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి విజయం సాధిద్దామని నితీశ్‌తో చెప్పినట్లు వెల్లడించాడు. ఒత్తిడికి లోనుకాకుండా పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే తమ విజయానికి కారణమని వివరించాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్ పర్యటనకు రావడంతో అక్కడి వాతావరణం, సమయ వ్యత్యాసానికి అలవాటు పడటం సవాలుగా మారిందని తిలక్ తెలిపాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నప్పుడు ఇలాంటి కారణాలను సాకులుగా చూపకూడదని స్పష్టం చేశాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు సమావేశంలో చెప్పిన మాటలు ఆటగాళ్లలో స్ఫూర్తి నింపాయని పేర్కొన్నాడు. ఇది సుదీర్ఘ పర్యటన అని, టీ20 జట్టు ప్రదర్శనతో నెలకొల్పే ప్రమాణాలు వన్డే, టెస్టు జట్లకు కూడా ప్రేరణగా నిలవాలని గంభీర్ సూచించినట్లు వివరించాడు. న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3--0తో కైవసం చేసుకున్న నేపథ్యంలో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడమే తమ లక్ష్యమని తిలక్ వర్మ స్పష్టం చేశాడు. సిరీస్ గెలిచినంత మాత్రాన సంతృప్తి చెందబోమని, ప్రత్యర్థికి ఒక్క విజయాన్నీ ఇవ్వకుండా 5--0తో సిరీస్‌ను ముగించాలని భావిస్తున్నట్లు తెలిపాడు. శుక్రవారం ఆక్లాండ్ వేదికగా జరగనున్న నాలుగో టీ20లోనూ అదే దూకుడును కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.





పింక్ డ్రెస్‌లో నిధి అగర్వాల్

సింపుల్ లుక్‌లోనూ స్పెషల్ అట్రాక్షన్!

నటి నిధి అగర్వాల్ తన ఫ్యాషన్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. తాజాగా పింక్ రంగు దుస్తుల్లో కనిపించి తనదైన స్టైల్‌తో అభిమానులను అలరిస్తోంది. సింపుల్‌గా కనిపిస్తూనే అందంగా మెరిసిపోతున్న ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నిధి ధరించిన పింక్ హాల్టర్ నెక్ డ్రెస్ అందంగా ఉంది. మెడ దగ్గర చిన్న బో, ప్లీటెడ్ డిజైన్‌తో కూడిన పైభాగం, కిందివైపు పొరలుగా జారే స్కర్ట్, అంచుల్లో రఫుల్స్ ఆమె దుస్తులకు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. వదులుగా వదిలిన ఉంగరాల జుట్టు, చిన్న హూప్ చెవిపోగులతో తన రూపాన్ని మరింత సింపుల్‌గా తీర్చిదిద్దుకుంది. వెనుకవైపు తెల్లటి తెరల మధ్య నుంచి పడుతున్న సూర్యకాంతి ఫొటోలకు ఆహ్లాదకరమైన రూపాన్ని ఇచ్చింది. ఇదిలా ఉంటే, నిధి అగర్వాల్ కెరీర్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ది రాజా సాబ్ సినిమాకు ఆశించిన స్థాయిలో ఓపెనింగ్ లభించకపోవడంతో, ప్రస్తుతం ఆమె చేతిలో మరో సినిమా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ముగిసేలోగా నిధికి కొత్త సినిమా అవకాశం వస్తుందేమో చూడాలి.



అందంతో కట్టిపడేస్తూ!

ఎమరాల్డ్ గ్రీన్ శారీలో అనుపమ పరమేశ్వరన్..

తనదైన అందం, ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికలతో అభిమానులను ఆకట్టుకునే నటి అనుపమ పరమేశ్వరన్ మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. తాజాగా ఎమరాల్డ్ గ్రీన్ రంగు కార్సెట్ శారీలో చేసిన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సంప్రదాయ చీరకట్టుకు ఆధునిక హంగులు జోడించిన ఆమె లుక్ అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ ఫొటోషూట్‌లో అనుపమ ఆకుపచ్చ రంగు కార్సెట్ బ్లౌజ్‌తో పాటు డ్రేప్డ్ స్కర్ట్ తరహాలో చీరను ధరించింది. చీర కొంగుపై బంగారు రంగు ఆకుల ముద్రణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్సెట్ ముందు భాగంలో చంద్రవంక ఆకారంలో ఉన్న చిన్న బటన్లు ఆమె దుస్తులకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. బంగారు రంగు చోకర్ నెక్లెస్, జుంకాలు, చేతినిండా గాజులతో అనుపమ తన లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దుకుంది. వదులుగా వదిలిన ఉంగరాల జుట్టు, వింగ్డ్ ఐలైనర్, చిన్న బిందీ ఆమె అందానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇక సినిమాల విషయానికొస్తే.. అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం శర్వానంద్, డింపుల్ హయాతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'భోగి' చిత్రంలో కనిపించనుంది. ఈ సినిమా ఈ ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది ఈ ముద్దుగుమ్మ

ఆ పాత్ర కోసం ప్రాణం పణంగా పెట్టా: రెజీనా కసాండ్రా

'మూకుత్తి అమ్మన్ 2'లో భైరవి అనే నెగెటివ్ రోల్‌లో నటిస్తున్నట్లు వెల్లడి

నయనతారతో తన సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పిస్తాయని వ్యాఖ్య



నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు. 2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్ కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

భారత సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన సినిమా

ఐదు దేశాల జీడీపీ కంటే 'రామాయణ' బడ్జెట్ ఎక్కువ!



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మరో అత్యంత భారీ ప్రాజెక్ట్ సరికొత్త ప్రపంచ సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ప్రముఖ దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో, పవిత్ర హిందూ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమా బడ్జెట్ వివరాలు సినీ వర్గాలను, ప్రేక్షకులను విస్తుపోయేలా చేస్తున్నాయి. బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణాసురుడిగా నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్ర ఫ్రాంచైజీ బడ్జెట్ అక్షరాలా రూ.4,000 కోట్లుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ భారీ మొత్తం ఐదు పసిఫిక్ ద్వీప దేశాల వార్షిక స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే అధికం కావడం గమనార్హం. ఈ పౌరాణిక చిత్రం రెండు భాగాలుగా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు భాగాల నిర్మాణ వ్యయంతో పాటు ప్రపంచవ్యాప్త ప్రచార కార్యక్రమాలు, హాలీవుడ్ స్థాయి గ్లోబల్ మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ ఖర్చులను కలిపి ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌ను కేటాయించినట్లు సమాచారం. చిత్రంలో రావణుడి ప్రతికూల పాత్ర పోషిస్తూ, నిర్మాణంలో భాగస్వామిగా (సహ నిర్మాతగా) వ్యవహరిస్తున్న నటుడు యశ్ ఈ వ్యవహారంపై స్పష్టతనిచ్చారు. ఇది కేవలం సెట్ల నిర్మాణానికి లేదా నటీనటులకు అయ్యే ఖర్చు మాత్రమే కాదని, భారతీయ సినిమాని ప్రపంచ మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిపేందుకు పక్కా ప్రణాళికతో చేస్తున్న అంతర్జాతీయ స్థాయి పెట్టుబడి అని ఆయన వివరించారు. ఈ సినిమా బడ్జెట్ ఎంత విస్మయకరమైనదో అర్థం చేసుకోవడానికి కొన్ని చిన్న దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోల్చి చూడాల్సి ఉంటుంది. ఈ ఒక్క సినిమా బడ్జెట్ ఐదు పసిఫిక్ ద్వీప దేశాల 2026 నామమాత్రపు జీడీపీ అంచనాల కంటే చాలా ఎక్కువ. ఉదాహరణకు తువాలు (సుమారు రూ.750 కోట్లు), నౌరు (రూ.1,764 కోట్లు), మార్షల్ ఐలాండ్స్ (రూ.3,078 కోట్లు), పలావు (రూ.3,357 కోట్లు), కిరిబాటి (రూ.3,618 కోట్లు) దేశాల మొత్తం జీడీపీ విలువలు ఈ సినిమా బడ్జెట్ కంటే తక్కువగా ఉండటం విశేషం. ఒక దేశంలో పూర్తి సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల విలువ ఆధారంగా జీడీపీని పరిగణిస్తారు. భారతదేశంలో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్‌తో నిర్మితమైన 'కల్కి 2898 ఏడీ', 'ఆర్ఆర్ఆర్' వంటి రికార్డు సినిమాలను కూడా 'రామాయణ' పూర్తిగా అధిగమించనుంది. రెండు భాగాల ప్రాజెక్ట్‌గా పరిశీలిస్తే, ఇది భారతదేశంలోనే అత్యంత ఖరీదైన ఫిల్మ్ ఫ్రాంచైజీగా సరికొత్త చరిత్ర సృష్టించనుంది. మొత్తం మీద 'రామాయణ' కేవలం ఒక వినోదాత్మక చిత్రంగానే కాకుండా, భారతీయ సినిమా ప్రపంచ రంగానికి విస్తరిస్తున్న ఆర్థిక సామర్థ్యానికి, ప్రామాణికతకు ఒక గొప్ప నిదర్శనంగా నిలుస్తోంది.

తుపాను బాధితులకు సంఘీభావం

- **'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ రద్దు**
- **ఏపీలో అర్నాబ్ తుపాను బీభత్సం**
- **కష్టకాలంలో వేడుకలు సరికాదన్న హీరో విష్వక్ సేన్**
- **అక్టోబర్ 30న సినిమా విడుదల యథాతథం**

టాలీవుడ్ యువ నటుడు విష్వక్ సేన్ తన రాబోయే చిత్రం 'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌ను 'అర్నాబ్' తుపాను అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో, బాధితులకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈరోజు ఈ వేడుకను రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో అర్నాబ్ తుపాను ఎలాంటి విధ్వంసం సృష్టిస్తోందో అందరికీ తెలుసు. ఇలాంటి కష్టకాలంలో మనం బాధితులకు అండగా నిలవాలి. ఇప్పుడు వేడుకలు నిర్వహించడం సరికాదని భావించి ఈవెంట్‌ను రద్దు చేస్తున్నాం. మనమంతా ఏపీకి అండగా నిలవాలి" అని విష్వక్ సేన్ పేర్కొన్నారు. అయితే, ప్రీ-రిలీజ్ ఈవెంట్ మాత్రమే రద్దు చేశామని, సినిమా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు ఒక ప్రెస్ మీట్ నిర్వహించి, 'కల్ట్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇక ఈ చిత్రం ముందుగా ప్రకటించినట్లుగానే అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని చిత్రబృందం స్పష్టం చేసింది.



Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**